అదొక పెద్ద కంపెనీ తాలూకు పెద్ద ఆఫీసు. ఆ ఆఫీసులో మామూలు ఆఫీసుల్లో మాదిరిగనే ప్యూనులు, ప్యూనులపైన యల్డీసీలు, వాళ్ళమీద యూడీసీలు, వాళ్ళమీద మానేజర్లు, ఆఫీసర్లు అజమాయిషీ చెలాయిస్తున్నారు.

ఆ ఆఫీసులో జనాలందరూ కాకాలతోనూ, బాకాలతోనూ, మేయడంతోనూ, మేయించడంతోనూ ఆఫీసర్ల ఇళ్ళల్లో అతను చెప్పిన పనులు, వాళ్ళావిడ చెప్పిన పనులు, వాళ్ళావిడ వీళ్ళావిడకు చెప్పిన పనులు చేయడంతోనూ, చేయించడంతోనూ, ఒహ వేళ అభిమానం అడుగుల పొడవుల్లో ఉన్న భార్యామణులు చేయనంటే బ్రతిమాలడంతోనూ, అంతకు వినకపోతే అడుగు బద్దతోనూ, అదీ విరిగిపోతే దుడ్డు కర్రతోనూ పాటం చెప్పి పని చేయించడంతోనూ... వాళ్ళ జీవితాల్ని ముందుకు హాయిగా సాగనంపుతున్నారు.

వాళ్ళందరూ అభిమానం లేని వాళ్ళు., ఉన్నా దాన్ని స్టేట్ బ్యాంక్ లాకరులో వాళ్ళు రిటైరయి రావాల్సిన డబ్బు వచ్చేవరకూ దాచేసుకున్నారు.


కానీ పట్టణాల పాలల్లో అన్నీ నీళ్ళే అయినా ఒకటో, అరో పాలచుక్క ఉండక పోదు. అలాగే మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు, బాధ్యతాహితులు, బాధ్యతారహితులు., జ్ఞానులు, మూర్ఖులు, నిస్వార్థపరులు, స్వార్థపరులు., పరోపకారులు, పరాపకారులు. , . . . ఇలా [illegible]న్ని రకాలుగా, జతలు జతలుగా మనుష్యులు, మనస్తత్వాలు రేషియో వ్యత్యాసం ఎక్కువే అయినా ఉన్నాయని నిరూపించడానికి. చెట్టు లేని చోట పనికొచ్చినా, పనికి రాకపోయినా, నీడ నిచ్చినా, ఈయక పోయినా., ఆకులున్నా, రాలిపోయినా ఏదో ఒ. ఆముదపు మొక్క ఉండాలేమో అన్నట్టు, ఆ ఆఫీసులో కూడా ఒక శాతం మంచి ఉన్నదని నిరూపించడానికి రమణయ్య గారు యూడీసీగా తన కర్తవ్యానికి తను కర్తగా ఎటువంటి భంగాన్ని కలిగించకుండా పని చేసుకుంటూ పోతున్నారు.

ఆయన ఇంటి పరిస్థితి కొస్తే ఆయనకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. అందులో పొడవులో ఎదిగి అందొచ్చిన వాళ్ళు [illegible] కాబట్టి. . . ఆ సంసార సాగరాన్ని ఈదడం నలభైపై చిలుకున్న రమణయ్య గారిదే!

మరచి పోయాను. . ఆయనకు ఒక పూట పెట్టి పోషిస్తున్నా భర్త అన్న అనురాగం ఇంచుకైనా రాలిపోకుండా, జారిపోకుండా, కరిగిపోకుండా., కరిగి పోకుండా., అప్పుల కోసం, ఆడపిల్లలకు పెళ్ళి సంబంధం కోసం తిరిగి తిరిగి వచ్చినప్పుడు కాళ్ళు పట్టేందుకు, కన్నీళ్ళు తుడిచేందుకు, పైతువాలు అందించేందుకు, అందుకునేందుకు భార్యామణి శాంతమ్మ ఉంది.

అతని వేషధారణ దగ్గర కొస్తే ఒక మామూలు పంచె, పొడవుగా మోకాళ్ళవరకూ ఉన్న లాల్చీ, ఆ పొడవులో చిరుగురుల్లాంటి కొన్ని చిరుగులు పుట్టుకొచ్చేవి, పెరిగిపోయినవి, ఆపరేషన్ చేసినవి ఉంటాయి.

రమణయ్య గారు కుచేలుడు లాంటి వారే అయినా, కుచేలునికి శ్రీకృష్ణుని దయా



# దొంగ



కొరుకొండ సత్యానంద్

మయమ్మైన చల్లని నీడ ఉండేది. కానీ ఈయనకో అదీలేదు. అసలుండేదే, కానీ ఈయనే పాడు చేసుకున్నారు. ఎలా అంటే తనపైనున్న మానేజరు, మొదటి కృష్ణునిగా, ఆఫీసరు రెండో కృష్ణునిగా ఉంటామన్నారు. కృష్ణుడు కొంగునున్న అటుకులడిగితే, ఈ అభినవ కృష్ణులు మాత్రం వచ్చేవాళ్ళ దగ్గర, పోయేవాళ్ళ పోయే వాళ్ళ దగ్గర బల్లక్రింద నుండి దక్షిణం పుచ్చుకొని వాళ్ళ కందించ మన్నారు. రమణయ్యగారు విన్లేదు. ఏం చేయాలో తోచక ఏదో అపవాదుచేసి కమిషన్ను వేయిస్తామని బెదిరించారు. . . ఏమిటో మరి నిజం పలికిన హరిశ్చంద్రునిలా ఈయన అసలు భయపడ్లేదు.

ఆ పనేదో ఆ ఆఫీసర్లనే చేయమంటే, ప్రిస్టేజి క్వశ్చనూ, తెలివి మీరి పోయిన రకరకాల మనస్తత్వ సంగమ, నిత్యసమర భరితమైన ప్రభుత్వం కళ్ళకు కనబడి పోతామేమో అన్న అనుమానంవల్ల తాము చెయ్యం, చేయిస్తాం అన్నారు. బహుశా వాళ్ళ దృష్టిలో ప్రభుత్వం కళ్ళకు కన్పించేది తప్పు చేసేవాళ్ళనేమో?

ఫలితంగా జీతం చాలక, తన మీద ఆధారపడి ఉన్న జనం ఎక్కువై అతను కష్టాల పాలౌతున్నాడు.

ఆ కష్టాల్లో అతి ముఖ్యమైనది తోటకూర కాడలా అర్జెంటుగా ఎదిగిపోయిన పెద్దకూతురు పెళ్ళి చేయడం. లక్ష్మిని ఉత్తరం చదివే వరకు రాసేవరకూ మాత్రమే చదివించారు. డిగ్రీలు చదివిస్తే అమె డిగ్రీకి సరిపడా డిగ్నిటీ గల, తనకు నచ్చిన, తమ కులంలో, తమ గోత్రంలోని పెళ్ళి కొడుకు దొరుకుతాడా? అన్న అనుమానం. తీరా తక్కువ చదివించి వూరుకుంటే, తక్కువ చదువు కున్న అమ్మాయి నాకక్కర్లేదు, నేను తక్కువ చదువుకున్నా, నా అదృష్టం బాగుండి నా కైదు వందల రూపాయలుద్యోగం దొరికింది, నా భార్య నాకంటే ఎక్కువ చదూకుంటే ఎవరి కాలైనా పట్టుకొని, ఏదైనా ఉద్యోగం ఇప్పించి రెండు ప్లస్ రెండు చేతులా ధనాన్ని ఆర్జించొచ్చు అని పెళ్ళి చూపుల కొచ్చే పెళ్ళి కొడుకులు అనడం మొదలెట్టే సరికి రమణయ్యగార్కి మతి పోయింది.

మొత్తానికి తిరగ్గా, తిరగ్గా ఒక తీగ కాలికి కాలికి తగిలింది. గబుక్కున అందుకొని చూస్తే అన్నీ సరిపోయిన సంబంధం అది. పెళ్ళి కొడుకు ఒక కంపెనీలో గుమాస్తా! "గుమాస్తానా?" అని అదో ఇదిగా మొదట అనుకున్నా, ఒక్కసారి తన బాక్‌గ్రౌండ్ గుర్తుకొచ్చి, 'అబ్బో! గుమాస్తాయే!' అని అనుకొని అన్నీ సెటిల్ చేశారు.

ఆ సెటిల్ మెంట్‌లో కాళ్ళు కడగడం, కన్యాదానం చేయడం, అక్షింతలు జల్లడం, పట్టుతాపు తాలు కట్టుకొని తను, తన భార్య పెళ్ళి కొడుకు, కూతుర్లతో పాటూ కూర్చోవడం వంటివి చాలా సులువైనవి, సరదాయైనవి... కాకపోతే . .పందిరి వేయించడం, బియ్యం మొదలు సకల సమస్త వంటసామగ్రి కొనడం వంటి డబ్బుంటేనే కానీ రానివి, అన్నిటి కంటే ముఖ్యమైనది అల్లుడిగారి కట్నం మాత్రం రమణయ్యగార్కి భీకర భయం కరాన్ని కల్గిస్తున్నాయి. ఆ భయం పోవడానికి

మందు డబ్బు! డబ్బు కావాలి. . .

అదే! ఈ లోకాన్ని, ఈ మనుషుల్ని, మనసుల్ని, అంతరంగాన్ని, ఆంతర్యాన్ని ఆనందాన్ని, ఆలోచనల్ని తన పిడికిలిలో, తన కాళ్ళ క్రింద నలిపేస్తుంది. . . నుసినుసి చేస్తుంది. . .

ఇప్పుడు పాపం రమణయ్య గార్కి డబ్బు కావాలి. . కావాలంటే ఏమైనా, అందనిస్వర్గమైనా, అకాడమీ అవార్డైనా, పద్మశ్రీ బిరుదైనా వస్తుందేమోకానీ . . డబ్బు మాత్రం రాదు. (రమణయ్యగారి లాంటి వారికే!)

ఉదయం ఎనిమిదయ్యింది.

కాలకృత్యాలు తీర్చుకొని, కడుపులో కాస్త టిఫిను, టీ పడేసుకొని శాంతమ్మ అందించిన పై తువాలు పైన వేసుకొని బయలు దేరారు.

"డబ్బు గురించి కాస్త గట్టిగా ప్రయత్నించండి. ." మెట్లు దిగబోతుండగా తలుపు దగ్గర నుండి శాంతమ్మ అన్న ఆమాట విన్పించింది రమణయ్యగార్కి.

రాత్రంతా నిద్రపోయి, ఆ నిద్రలో అన్నింటితో పాటూ ఈ విషయాన్ని కూడా మరచిపోయిన రమణయ్యగార్కి గబుక్కున కూతురు

మీరు ఆరోగ్యంగా ఉండాలంటే
మీ గుండె రోజుకు 1,44,400 సార్లు స్పందించాలి



అందువలన సాధారణమైన బాధలు, నొప్పులకు మందులు ఎందుకు వాడడం? వీటిలో ఉండేవి కండరాలకు ఉపశమనం ఇచ్చే కోడిమైన్, కోఫిమైన్, పెనాసిటిన్ తదితర పదార్థాలు ఉంటాయి. సురక్షితమైన మందులు వాడండి. జిందాబామ్ ఉపయోగించండి. బాధానివారణలో తిరుగులేనిది. త్వరితంగా ఉపశమనం కలిగించడానికి అణువణువులోకి చొచ్చుకు వెడుతుంది. బాధలు, నొప్పులు, జలుబులకు సాటిలేనిది.




కార్ఖానా జిందా తిలిస్మాత్
అంబర్‌పేట, హైదరాబాద్-500 013

జిందాబామ్
సురక్షితమైన, సత్వరమైన బాధానివారిణి

పెళ్ళి, డబ్బు జ్ఞాపకం వచ్చాయి.

కష్టాల ఆశీర్వాదాలతో రమణయ్యగార్కి వయస్సు ం మించిన ముసలి తనం, నీరసం, నిస్సహాయత ఎదురయ్యాయి.

బరువుగా అడుగులు వేస్తూ ఆలోచిస్తున్నారు.

నిష్టటితో అడగాల్సిన వారందర్నీ అడిగారు. ఎవ్వరూ పెదవి విరువ కుండా సమాధానం చెప్ప లేదు. ఎదురు సీటు యల్డీసీ రామారావుని అడిగితే ఇంత సర్వీసుండి ఆ మాత్రం గడించలేదా? అన్నాడు. . . అని వూరుకున్నాడా? కావలిస్తే ఎంతైనా ఇస్తానన్నాడు—నూటికి పది రూపాయల వడ్డీ చొప్పున. తీసుకుంటే, దాంతో కూతురు పెళ్ళి చేసేస్తే, ఆ తర్వాత ప్రతీనెలా జీతంలో రెండ్రోజుల టీ ఖర్చుంచుకొని మిగిలింది రామారావు జేబులో వెయ్యాలి. . . అందుకే రమణయ్యగారు ఏం మాట్లాడలేదు. పోనీ గోడమూల ఉండే, పద్మజను అడుగుదామంటే, మాటలు, చూపులు, వేషాలు, నవ్వులు ఎలా ఉన్నా ఒక ఇంటి ఆడపిల్ల గుమ్మందాటి ఉద్యోగం చేస్తుందంటే ఆ అమ్మాయి వెనకాల ఎంత గాథ ఉందో! అని ఆ తలంపును విరమించు కున్నారు.

పాపం రమణయ్య గారికింకా తెలీదు, ప్రకృతిని ఆపలేక పోయినా పెళ్ళిళ్ళు మాత్రం చేసుకోడం మానేద్దామని అనుకుంటున్న వీరనారీమణులెందరో ఉన్నారని., ఉద్యోగం కేవలం కడుపు కోసం కాకపోయినా కంపెనీ కోసం చేస్తున్న వారెందరో ఉన్నారని., ఆకర్షణతో నవ్వుతో, మాటలో, కాఫీ, టిఫిన్, బస్సు ఖర్చులు మిగిల్చే అతివలెందరో ఉన్నారనీను.

తెగని లెక్క పట్టుకొని కాగితాలు వేస్టు చేస్తున్న విద్యార్థిలా, రమణయ్యగారు డబ్బు గురించి ఆలోచిస్తూ ప్రయాస వృధా చేస్తూ నడుస్తున్నారు.

ఎనిమిదిన్నరయ్యే సరికి ఆఫీసుకు చేరుకున్నారు. అప్పటికింకా ఎవ్వరూ రాలేదు. ఫైళ్ళు, అవీ సర్దుకొని కూర్చునేసరికి ఒక్కొక్కళ్ళూ వస్తున్నారు. వస్తూ వస్తూ రమణయ్యగార్ని పలకరిస్తూ తమ తమ సీట్లలో కూర్చుంటున్నారు.

రమణయ్యగారి ఆలోచనలన్నీ డబ్బుచుట్టూ గిరిటీలు కొడుతున్నాయి.

ఎవరైనా వచ్చి ఏ వాయిదాలు కాగితాన్నైనా ఎమర్జెన్సీ ఫైల్లో పెట్టమంటే అంటుకుందో ముట్టచెప్తామంటే ఎంత బావుణ్ను అని కూడా ఒకసారి అనుకున్నారు.

కాని. . . అది తనకు పడని పని. . గొంతు కోసినా తన గొంతులోంచి రానిమాట అది. . అలా ఆలోచిస్తున్నారు.

అంతలో నవ్వుల రాణిలా వస్తుంది పద్మజ.

తెల్లని శరీరచ్ఛాయ, పోనీటెయిల్ హెయిర్‌స్టైల్, బుగ్గలు, చక్కని పలువరుస, వయ్యారి నడక, ఆకర్షణమైన అవయవాలు. . .

ఇదంతా రమణయ్యగారు పట్టించుకోలేదు. అది ఆయన తప్ప మిగిలిన వాళ్ళందరూ (పెళ్ళయినవాళ్ళు, పెళ్ళి కాని వాళ్ళు) రాత్రుళ్ళు పలవరించే తీరు. . .

ఆ నవ్వువిని తలెత్తి చూశారు పద్మజ ముఖం వైపు. . . (మిగిలిన వాళ్ళైతే ఎక్కడ చూసేవారో?)

"నమస్కారం బాబయ్యగారూ!" అన్చెప్పి తన సీట్లో కూర్చుంది పద్మజ.

రమణయ్యగారు తెప్ప పెట్టుకొని ఒక నీరసపు నవ్వు నవ్వారు. గోడ గడియారం తన పని తాను చేసుకు పోతోంది. . . తొమ్మిది. . . పది. . . పన్నెండు. .

మరురోజు కోసం గడియారం టక టక మంటూ ఆయాస పడుతుంది. డబ్బు కోసం రమణయ్యగారి హృదయం దడ దడ మంటుంది.

అది, లంచ్ టైము.

ఒక్కొక్కళ్ళు కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నారు. పద్మజ కూడా క్యాంటీన్‌కు వెళ్తుంది.

అందరి కంటె ఆఖర్న రమణయ్యగారు నీరసంగా లేచారు. ఆలోచనల్ని ఆపకుండానే తల వంచుకొని నడుస్తున్న రమణయ్యగార్కి తళుక్కున ఏదో మెరిసినట్లనిపించింది పద్మజ సీటు దగ్గర.

ఏమిటా అని పరీక్షగా చూశారు. . . పద్మజ మెళ్ళో లాకెట్టు.

చుట్టూ చూశారు. . . పరిసరాల్లో ఎవ్వరూ లేరు. . . రమణయ్యగారి బ్రెయిన్‌లో సెరిబ్రల్ హెమిస్ఫియర్స్ బాగా పని చేశాయి.

వంగి గబుక్కున తీసి జేబులో వేసుకున్నారు.

ఇక ఒక్క క్షణం కూడా అక్కడ ఉండకూడదా బయటకు నడిచారు.

జేబు చాలా బరువుగా ఉంది.

రెండు తులాలు పైనే ఉండొచ్చు.

ఆ మధ్య పద్మజ పుట్టిన రోజని వాళ్ళంకుల్ ప్రెజెంట్ చేశాట్ట.

పెళ్ళయితే మంగళ సూత్రాల్ని జాకెట్టు లోపల వేసుకొని, పెళ్ళి కాకపోతే నాకు పెళ్ళికాలేదు చూడండోయ్, అన్నట్టు పైకి బాగా కన్పించేట్టు లాకెట్ వేసుకునే చాలా మంది ఆడవాళ్ళల్లో పద్మజ కూడా దాన్ని పైకి బాగా కన్పించేలా వేసుకుని మురిసి పోతు౦ది.

క్యాంటీన్‌కు వెళ్ళి ఒక మూల కూర్చున్నారు. రమణయ్యగారు. క్యాంటీన్ మనిషి అప్పటికే వచ్చి కారేజి, కంచం రెడీగా పెట్టింది.

"ఏం బాబూ! ఆలస్యంగా వచ్చారు?" అని అడిగింది.

ఎందుకో ఒక్కసారిగా వెన్ను అదిరింది రమణయ్య గార్కి.

"ఆ... అంటూ మంచినీళ్ళు పట్రా!" అన్నారు.

భోంచేస్తుంటే యల్డీసీ సుబ్బారావు వచ్చి ప్రక్కన కూర్చున్నాడు.

"రామయ్యగారూ! భోం చేస్తున్నారా? ఏం కూర? " అని అడిగాడు కంచంలో ఉన్న పదార్థాలన్నీ చూస్తూనే!

"వంకాయ దయ్యా? అరటి కాయ కూడ... రుచిగాడు..." అన్నారు.

"నా భోజనం అయిపోయిందండీ!" అని నవ్వాడు.

ఎందుకు నవ్వాడో అర్థం కాలేదు: ఆ నవ్వులో

మంచి పుస్తకాలు

1. జీవితరహస్యాలు:– దివ్యజ్ఞాన సూత్రాలు. రూ. 5
2. రమ్యరతి:– దాంపత్య రహస్యాలు. రూ. 5
3. సంతానము:– గర్భనిరోధ మార్గాలు. రూ. 5
4. చెలిమినీటు:– సంపాదన మార్గాలు. రూ. 5
5. అద్భుత హాస్య కథలు:– నవ్వటానికే. రూ. 5
6. రసికచిత్ర యక్షకథలు:– శృంగార సాహిత్యం. రూ. 5
7. మానసిక వ్యాధి నివారణలు:– స్వప్న చికిత్స. రూ. 5
8. మానసిక శక్తులు:– అన్ని అద్భుత విచారాలతో. రూ. 5
9. మంత్ర శక్తి:– వివిధ సాధన రహస్యాలు. రూ. 5
10. ప్రకృతి వైద్య విధానాలు:– అన్ని రోగాలకు ఔషధములు. రూ. 10
11. ఆహార వైద్యము:– ప్రకృతి ఆరోగ్య మార్గాలు. రూ. 10
12. మూలిక వైద్యము:– అందరికి ఉపయోగపడు ఔషధాలతో. రూ. 10
13. దైవదర్శిని:– బాధలు విముక్తి దివ్యరహస్యాలు. రూ. 10
14. జ్యోతిష దర్శిని:– నిత్యజీవన జ్యోతిష విధానము. రూ. 10
రూ. 20 లు పంపిన అర్ధరిక్త పుస్తకములు పంపబడును.
అంతకన్నా తక్కువ రిజిస్టరు పోస్టేజీ రూ. 4 అదనం
[illegible]
5/5 [illegible] హైదరాబాదు-4

ఇంటింటికీ ఆనందజ్యోతి

ఆనందజ్యోతి

త్వరలో... కొత్త సీరియల్స్

అందగాడు

రచయిత్రి మాదిరెడ్డి సులోచన

రచయిత: చిల్లకుల పురుషోత్తం

ఏజెంట్లు లేనిచోట ఏజెంట్లు కావలెను!

ఆనందజ్యోతి

గబుక్కున అతనిచేయి తన జేబు పడుతుందేమో అని కాస్త జాగ్రత్త పడ్డాడు రమణయ్యగారు.

సుబ్బారావు మొదట్లో తనను మామయ్యగారూ అని పిలుస్తుంటే ఏదో మామూలుగా పిలుస్తున్నాడేమో అనుకున్నారు.

కానీ తర్వాత తెలిసింది పద్మజ దగ్గర అతని ప్రవర్తనను బట్టి... పద్మజ తనను బాబాయి గారూ అని పిలవడం చూసి సుబ్బారావు లాంటి మరి కొందరు తనను మామయ్యగారూ! అని అనడం పరిపాటైపోయింది.

అదేం తమాషానో అర్థం కాలేదు రమణయ్య గార్కి.

అక్కడి నుండి సుబ్బారావు వెళ్ళిపోయే వరకూ రమణయ్య గారి మనసు మనసులో లేదు..

అందరి భోజనాలు అయిపోయాయి

నెమ్మదిగా కాంటీన్ నుండి ఆఫీసులోకి దారి తీస్తున్నారు

రమణయ్య గారుకూడా అక్కడి నుండి బయలు దేరారు

నడుస్తుంటే అతని కాలిపై భాగానికి లయ బద్ధంగా లాకెట్ తగుల్తుంది. అది అలా తగు ల్తుంటే దానికి తాళంలా రమణయ్యగారి గుండె కొట్టుకుంటుంది.

వెనక నుండి రామారావుతో మాట్లాడుకుంటూ వస్తున్న పద్మజ కంఠం విన్పించింది. ఓరగా ఏదో చూస్తున్నట్లుగా వాళ్ళవైపు చూశారు. రామా రావు ఏదో చెప్తున్నాడు.

"ఇంకా చూసుకోలేదు" అనుకున్నారు మన సులో.

"వెధవది ఆ ప్రక్కనున్న రామిగాడు అస్త మానూ ఆ అమ్మాయి వంకే తదేకంగా చూస్తాడు. గొలుసు లేక పోవడం వాడు పసిగడితే?. .అమ్మో" అనుకున్నారు.

ఎందుకో మామూలు కంటె వేగంగా కొట్టు కుంటుంది గుండె.

అంతలో "బాబాయి గారూ!" అన్న పిలుపు వినబడి వెనక్కి తిరిగి చూశారు.

పద్మజ తన వైపే వస్తుంది.

రమణయ్య గారి గుండెలు తెగి పోతున్నాయి.

పద్మజ దగ్గిర కొచ్చింది.

"ఏమ్మా?" అన్నారు ఆమె నవ్వుతూ వస్తుండ డంతో గుండెను కాస్త దిటవు చేసుకొని...

"రేపు నా బర్త్ డే బాబాయి గారూ. మీరు తప్పకుండా రావాలి అంటూ ఓ ఇన్విటేషన్ ఇచ్చింది.


"అలాగే తప్పకుండా" అంటూ అందుకున్నారు దాన్ని.

అందరూ వాళ్ళ వాళ్ళ సీట్లలో కూర్చొని ఎవరి పని వాళ్ళు చేసుకుంటున్నారు...

పద్మజ కూడా సీరియస్‌గా తన పని తాను చేసుకుంటుంది.

రమణయ్యగారి మనసు మనసులో లేదు.

పరిస్థితుల ప్రభావం వల్ల ఎంతటి వాడైనా ఎంతటి నీచానికైనా దిగజారగలడని తనలో తనే అనుకున్నారు.



తను చేసింది దొంగతనం అని మనసు చెప్తుంటే... కాసేపు ఆలోచించి, నేను చేసింది దొంగతనం ఎలా అవుతుంది? నేనేమైనా దాన్ని దాచేశానా? దొరికింది, జేబులో వేసుకున్నాను.. అని సమర్థించు కున్నారు.

తన తాతలు, ముత్తాతలు ఎంతో విలువైన బట్టల్ని, వస్తువుల్ని బీదలకు దానాలు చేసేవారని తన అమ్మమ్మకు వాళ్ళ అమ్మమ్మ చెస్తే, ఆవిడ ఈయనకు చెప్పినప్పుడు విన్నారు.. అంతటిగొప్ప వంశంలో పుట్టిన తను ఈ నాడు ఇలాంటి పని చేయడం అంటే.. తల గిర్రున తిరుగుతుం దాయనకు..

అయినా కాలం మారిపోతుంది... కాలంతో పాటూ పరిస్థితులూ మారుతున్నాయి, కరువూ పెరుగుతుంది... తనేమైనా సరదాకు చేశాడా?

ఎంతగా సమర్థించుకున్నా అతనిలో ఇంకా ఏదో మిణుకుమిణుకు మంటూనే ఉంది.

మనిషిలోపల ఆత్మ, అంతరాత్మ అని రెండున్నా యట... ఆత్మ గుర్రంలా దౌడు తీస్తుంటే అంతరాత్మ కళ్ళెంలా పనిచేసి దాన్ని కంట్రోల్ చేస్తుందిట.

రమణయ్యగారి ఆత్మను అంతరాత్మ కంట్రోల్ చేయలేక పోతుంది. ఆత్మ తను చేస్తుంది రైటే నని, సబబేనని, సమంజసమేనని అంతరాత్మను ఒప్పించ తీవ్రంగా కృషి చేస్తుంది.

ఒక్కసారి జేబు తడుము కున్నారు...

లాకెట్ స్పర్శ ఏదో విష నాగులా అన్పిం చింది రమణయ్యగార్కి.

ఈ సంఘర్షణలో కాలం ఔచిత్యం కలుగ జేసు కోనకుండా తన విధిని నిర్వర్తించుకొని పోతుంది.

ఆఫీసు వదిలి పెట్టేసేందుకు మరో గంట టైము మాత్రమే ఉంది.

ఈ ఒక్క గంటా గండం లేకుండా గడిచేస్తే రెండువేలపైన తను గడించిన వాడవుతాడు. మరో కొంత ఏ మార్వాడీ వాడి దగ్గరైనా అప్పుచేసి, ఉన్న వస్తువుల్ని (దూర దృష్టితో కడుపులు మాడినా పెట్టుబడల మీద దాచినవి) తాకట్టు పెట్టో, అమ్మో, ఈ పెళ్ళి అయిందన్పించొచ్చు.

ఇలా ఆలోచనలు సాగుతున్న సమయంలో పద్మజ తన సీటు ముందుగా మానేజరు గదిలోకి వెళ్ళింది

ఆమె నడుస్తుంటే ఎందరో హృదయాలు జివ్వుమంటున్నాయి.

కానీ రమణయ్యగారి హృదయం మాత్రం కెవ్వు మంటుంది.

అఖరు గడియలో ఏం జరుగుతుందోనని వేయి దేవుళ్ళకు మొక్కు కుంటున్నారు.

పద్మజ వెళ్ళిన ఐదు నిముషాలలో ప్యూను వచ్చి "మానేజరు గారు మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు.

అంతే!

రమణయ్యగారి గుండెగూట్లో చిలుక ఎక్క డికో పారిపోబోయింది.

పారిపోబోతున్న చిలుకను పట్టుకొని నెమ్మ దిగా అడుగులో అడుగు వేసుకుంటూ పులినోట్లోకి వెళ్ళబోతున్న బక్క ప్రాణిలా నడిచారు.

లోపల కడుగు పెట్టేసరికి మానేజరు, పద్మజ తన వైపు సీరియస్‌గా చూడడం చూసేసరికి రమణయ్యగారి కాళ్ళు అతని స్వాధీనం తప్పి పోయాయి.

"రండి రమణయ్యగారూ! ఈ కవరు తీసు కోండి!" అన్నాడు అదోలా మానేజరు.

కవరు అందుకొని విప్పి చూసేసరికి రమణయ్య గారి గుండె తెగిపోయింది.

"మానేజరు గారూ!..." దీనంగా అన్నారు.

"అవునండీ! పెద్దవారై ఉండి మీరు చేసిన దొంగ పనికి ఈ వారం రోజుల సస్పెండ్ ఆర్డరు చాలదు... డిస్మిసింగ్ చేద్దాం అన్నాను. కానీ జాలి గుండెగల పద్మజ వల్ల మీకు శిక్ష తగ్గింది.. మర్యాదగా మీ జేబులో ఉన్న లాకెట్ తీసి పద్మజ కిచ్చేయండి..."

ఏమండీ!

మీరు పట్టభద్రులు కావలెనని వాంఛిస్తున్నారా? మీరు Matric పరీక్ష ప్యాసైనా, కాకపోయినా, ఆంధ్ర యూనివర్శిటీ పట్టభద్రులు కావచ్చును. వివరములకు 2/— M.O. ద్వారా పంపగలరు. Postal మరియు Personal శిక్షణ లభించును.

JAYVEE TUTORIALS

హైదరాబాద్—500003

1979 లో

మీ అదృష్టం



SRI KRISHNA JYOTISH
ASHRAM (AFW-2)
KARTARPUR-144801 (PB)




రమణయ్య గారు కుప్పలా కూలిపోయారు.

"అయ్యగారు మిమ్మల్ని రమ్మంటున్నారండీ!" రెండోసారి గట్టిగా అన్న ప్యూను మాట విని ఉలిక్కిపడి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చారు రమణయ్యగారు.

ఇంత వరకూ జరిగింది తన పూహే అయినా రమణయ్యగారి గుండె ఇంకా పీకుతూనే ఉంది.

అలాగే లేచి బయలుదేరారు మానేజరు వద్దకు.

లోపల కడుగు పెట్టే సరికి "వెరీగుడ్ ఇన్ టైమ్‌లో పని పూర్తి చేసేశారు.. ..ఇక మీరు వెళ్ళవచ్చు. . ." అన్న మానేజరు మాట వినిపించింది.

"థాంక్స్" చెప్పి నవ్వుతూ బయటకు వెళ్ళి పోయింది పద్మజ.

పద్మజ బయటకు వచ్చి పైళ్ళన్నీ సర్ది కుర్చీలో తీరుబడిగా కూర్చుంది.

రేపటి తన బర్త్‌డే పార్టీ గురించి ఆలోచిస్తుంటే, వాళ్ళ అంకుల్ జ్ఞాపకం వచ్చి అతనితో పాటూ అతనిచ్చిన లాకెట్ గుర్తుకొచ్చి. . . ఆమె చేయి గుండెలమీద కెళ్ళింది.

అంతే! ఒక్కసారిగా ఉలిక్కిపడి మెడను చూసుకుంది.

మానేజరుగారి చాంబర్‌లోంచి బయటకు వస్తున్న రమణయ్యగార్కి ఆఫీసులో జరుగుతున్న గందరగోళం చూసి ఒక్కసారిగా గుండాగి నట్లయింది.

"ఒరే రాముడూ! ఇలారా! ఆ డస్క్ క్రింద చూడు. .ఏహోయ్ అప్పారావ్! ఆ బీరువా క్రింద చూడు. . ." అని రామారావు అరుస్తున్నాడు. విషయం అర్థమై పోయింది రమణయ్య గార్కి. అలా ఒకక్షణం సేపు శిలా ప్రతిమలా నిల్చుండి పోయారు.

మరుక్షణంలో అలా ఉండిపోతే అనుమానం రావచ్చునన్న సందేహంతో పద్మజ దగ్గరకెళ్ళి "ఏమిటమ్మా. ఏం జరిగింది?" అని అడిగారు.

"మా అంకుల్ ప్రజంట్ చేసిన లాకెట్ పడి పోయిందండీ! ఈ మధ్య దాని కొండీ అస్తమానం వూడిపోతుంది. . . . బాగు చేయిద్దాం అనే అనుకుంటున్నాను.. . ఇంతలోనే పోయింది.. మధ్యాహ్నం కూడా దాన్ని చూసుకున్నానండీ!" అంది ఏడుపు పర్యంతంగా

గుండెలో రక్తం పొంగిన యేరులా ప్రవహిస్తున్నా ఆ భావాన్ని పైకి కన్పించనీయకుండా "వెదకండి... ఇక్కడే ఎక్కడో ఉంటుంది. . ." అన్నారు.

ఆ మాటలు కృత్రిమంగా ఉన్నాయి.

ఆయనకూడా బల్లల క్రిందా, కుర్చీ క్రిందా వంగి వెదకు తున్నారు.

ఆఫీసు స్టాఫంతా ఆఫీసంతా వెదికేస్తున్నారు.

ఎవరికి దొరికితే వాళ్ళు తీసుకెళ్ళి పద్మజ కిచ్చేసి ఆమె ఆనందమయ నేత్రద్వయ ప్రసారిత కాంతి పుంజాల్ని తమపై పడేలా చేసుకోవాలని తాపత్రయ పడు తున్నారు.

రమణయ్య గారిలో ధైర్యం కాస్త తగ్గి ఆ బీరువా చాటు కెళ్ళి జేబులోంచి పైకి తీసేసి ఆ బీరువా దగ్గర దొరికిందని చెప్పి ఇచ్చేద్దామని అనుకున్నారు.

అందుకు ఆత్మ ఒప్పుకోలేదు. . . మళ్ళీ తన అభిప్రాయాన్ని మొదటికే మార్చుకున్నారు.

ఖాళీగా నిల్చోకుండా ఒక టేబిల్ క్రిందకు దూరి దొరకదని తెలిసినా ఏదో వెదికేస్తున్నారు... కాదు. . . నటిస్తున్నారు.

ఆ నటిలో తన ప్రక్క జేబుకు చిన్న కన్నం ఉందని, లాకెట్ బిళ్ళ లోపల ఉండిపోయి, ఆ కన్నంలోంచి గొలుసు మాత్రం పైకి మిల మిలా మెరుస్తూ కన్పిస్తుందని, ఈ విషయాన్ని రామారావు తప్ప మరెవ్వరూ గమనించలేదని ఆయన గమనించ లేక పోయారు.

"అరెరె! వయసు మీరిపోయినవారు, పెద్దవారు. . . మీకెందుకండీ శ్రమ? మేం లేవూ ఇలాంటి విషయాలు గమనించడాన్కి. . .? మీరిలా కూర్చోండి. . ." ఎవరైనా చూస్తే మోనని రమణయ్యగారిని లేపి ఒక కుర్చీలో కూర్చోబెడుతూ అన్నాడు రామారావు.

ఆ గడబిడలో అతని మాటల్లోని వ్యంగ్యం గుర్తించలేదు రమణయ్యగారు.

పైరో పని నిముషాలు వెదకి వెదకి, విసిగి, వేసారి పోయి ఒక్కసారి పెదవి విరచి, 'బాడ్‌లక్' అని కొందరూ, ఎవరో పట్టుకుపోయుంటారు దొంగ వెధవలు అని కొందరు, సారీ అని కొందరూ తమ సానుభూతిని వెల్లడించి వెళ్ళి పోతున్నారు.

ఆ మాటలకు రమణయ్యగారి గుండె రైలు పట్టాల క్రింద పెట్టినట్లయ్యింది.

ఆఫీసంతా సుమారు ఖాళీ అయిపోయింది.

రమణయ్యగారు లేచి " ఎక్కడో పడిపోయుంటుందమ్మా ఏం చేస్తాంనడు"! అన్నారు పద్మజతో.

"పడిపోతే ఇక్కడే ఎక్కడో పడిపోయుంటుందండీ! ఎవరో కాజేసేసి ఉంటారు. . ." అంది ఏడుపు పర్యంతంగా.

"పోన్లే అమ్మా! ఏం చేస్తాం ? ఎంత వరకూ ప్రాప్తమో అంతే! మరి నే వెళ్ళొస్తానూ! వెధవది దానికోసం బెంగ పెట్టుకోకమ్మా, దొరికేదైతే అదే దొరుకుతుంది. ." అని బయటకు నడిచారు.

రమణయ్యగారు నడుస్తున్నారు గానీ తనేదో పాపాన్ని మోసుకెళ్తున్నట్లుగా ఫీలవుతున్నారు..

ఎప్పుడూ చేయని పని. .. అతి క్లిష్టంగా, ఘోరాతి ఘోరంగా అన్పిస్తుంది..

ఆ పనిచేయడం వల్ల అతని మనసులో రగిలే సంఘర్షణను అతను భరించలేక పోతున్నారు.

పోన్లె. . . జరిగిందేదో జరిగి పోయింది. . తను ఎప్పుడూ చేయని పని చేయలేని చేయరాని పని చేసినందుకు ఫలితం దక్కింది..

ఎలాగైతేనేం, తన కూతురు పెళ్ళి కాస్త సులువుగా చేసెయ్యొచ్చు. . .

ఇలా ఆలోచిస్తున్న రమణయ్యగార్కి "మావయ్యగారూ!" అన్న పిలుపు వినబడి పరిచయమైన ఆ కంఠస్వరానికి ఒక్కసారి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశారు.

రామారావు నవ్వుతూ దగ్గర కొచ్చాడు.

"ఏమిటోయ్ ఇవాళ ఇలా వస్తున్నావ్?" చెప్పి

పెట్టుకున్న నవ్వుతూ అన్నారు.

తన ముఖ కవళికలు పూర్తిగా మార్చుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు రమణయ్యగారు.

"అబ్బే ఏం లేదండీ! మా ఆవిడ పిల్లల్ని తీసుకొని పుట్టింటి కెళ్ళింది.. ఒంటరిగాణ్ణే. .. ఏం పనుంది.. అలా కాఫీ త్రాగొద్దాం రండి.." అన్నాడు రామారావు.

"ఎందుకయ్యా ఫర్వాలేదు.. ఎలాగూ ఇంటి కెళ్ళిపోతాను కదా!"

ఎంత వేగంగా ఇంటికి వెళ్ళిపోయి ఆ భారాన్ని దించేసుకుందామా అనుకుంటున్న రమణయ్యగార్కి రామారావు అలా పిలవడం చాలా ఇబ్బందిగా ఉంది.

మరీ మొండికేసి రానంటే అనుమానం వస్తుందేమో అన్న భయం!.

"ఇంటి కెళ్ళరనీ కాదూ, కాఫీ త్రాగరనీ కాదూ! సర్దాగా రండీ!" అని ఒక హోటల్లోకి తీసుకెళ్ళారు.

హోటల్లో పామిలీ రూంలో కూర్చోని రెండు కాఫీ ఆర్డరిచ్చి బాతాఖానీ మొదలు పెట్టాడు రామారావు.

"పాపం! క్రొత్త లాకెట్టు.. రెండు తులాల పైనే ఉంటుంది.. అనవసరంగా పోగొట్టుకుంది" అన్నాడు.

ఆ మాటకు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు రమణయ్యగారు.. కానీ వెంటనే "అవును పాపం!" అని ఏదో మామూలుగా అన్నారు.

అంతలో కాఫీ వచ్చింది.. సర్వరు బిల్లు పెట్టి వెళ్ళిపోయాడు.

రామారావు, రమణయ్యగారు ఇద్దరూ కాఫీ త్రాగుతున్నారు.

రామారావు కాఫీ త్రాగుతూ రమణయ్యగారి వంకే చూస్తున్నాడు.. . రమణయ్యగారు అది గమనించి తప్పు చేసిన వాడిలా, బుద్దినటిస్తూ కాఫీ, కప్పు వంకే చూస్తూ త్రాగు తున్నారు.

"రమణయ్య గారూ! నే నో పని చెప్తాను చేస్తారా?"

"ఏమిటి బాబూ!" అన్నారు కాఫీ త్రాగడం పూర్తి చేసి కప్పు టేబిల్ మీద పెడుతూ..

అతనిలో ప్రతి చర్య, ప్రతి కదలికా ఇత్తడి వస్తువు మీద గోల్డు కవరింగులా ఉన్నాయి.

"అ.. ఏముంది? మీ జేబులో లాకెట్ పైకి తీస్తారా? చూస్తాను..."

ఊహించని ఆమాట విని గతుక్కు మన్నార రమణయ్యగారు.

అతనికి శరీరంలో రక్తం ఒక్కసారిగా గడ్డ కట్టినట్టనిపించింది. చెవుల్లో రైలింజను కూతలు గింగుర్లు పెడుతున్నాయి.

"ఏమిటి బాబూ! నువ్వంటున్నది..?"

ఆ మాట గొంతైన నూతిలో నుండి వచ్చి నట్లుంది.. అతనిలో నరనరాలు సాగి పోతున్నట్లున్నాయి.

"ఇక్కడ ఎవ్వరూ లేరు లెండి.. నేనెవ్వరికీ చెప్పను లెండి..."

"..." గుండె కొట్టుకోవడం పూర్తిగా ఆగిపోయినట్లుంది. కళ్ళు మసక మసకగా కన్పిస్తున్నాయి.

"రమణయ్యగారూ! నా దగ్గరెందుకు మొహమాట పడతారూ? మీ జేబు కన్నంలోంచి పైకి కన్పిస్తున్న లాకెట్టు నా కంట పడిందిగాబట్టి మీరు అదృష్టవంతులై పోయారు... లేకపోతే.."

"...." ఒళ్ళంతా వణికి పోతుంది రమణయ్యగార్కి.

"మాట్లాడరేమండీ? నేనేగాని అప్పుడు అందరికీ చూపించానంటే మీ పరువు కాస్తా గంగలో పూర్తిగా కలసిపోను.. కాస్త ఇంగిత జ్ఞానం ఉన్న వాడ్ని కాబట్టి ఊరుకున్నాను.. లాకెట్ పైకి తీయండి" అన్నాడు రామారావు.

"....' అతనిలో చలనం లేదు.

"మాట్లాడరేం? సమయం మించి పోయింది. నేనేమీ చేయలేనని అనుకుంటున్నారా? తలచుకుంటే నేనేమైనా చేయగలను.. ఆ తరువాత మీ ఇష్టం. లాకెట్ పైకి తీయండి" ఈ సారి కాస్త గట్టిగానే అన్నాడు.

"బా.. బా.. రామారావు..." ఏడుపు వచ్చేసింది రమణయ్యగార్కి.

"ఏమండీ? 'దొంగతనం' చేసినప్పుడు లేని భయం పరువు పోతుందంటే వస్తుందా?" నొక్కి నొక్కి అని "ముందు ఆ లాకెట్ తీసి ఇలా ఇవ్వండి" అని గద్దించాడు.

రమణయ్యగారిలో రక్తప్రసారం పూర్తిగా ఆగిపోయింది., జీవచ్ఛవంలా తయారయ్యారు.. చేసేదేం లేక జేబులోంచి లాకెట్ పైకి తీసి వణుకుతున్న చేతులతో రామారావు కందించారు.

రామారావు దాన్ని ఆతృతగా అందుకొని దాని వైపు పరీక్షగా చూసి ఆనందంతో ముద్దు పెట్టుకొని జేబులో వేసుకున్నాడు.

రమణయ్యగారు తిండిలేక పోయినా, నీతిని దాటకుండ ఏ పరువైతే కాపాడుకోవాలని ఇన్నాళ్ళూ బాధ పడ్డారో, ఆ పరువును వేలపాలు చేసిన తన జేబు కన్నాన్ని జేబులో చేయిపెట్టి దరిద్రదేవతను ఆరాధిస్తున్నట్లుగా చేతో తడిమారు.

ఎందుకో ఆయన కొకసారి ఒళ్ళు జల్లుమంది.

'మావయ్య గారూ!.. థాంక్సు. మీ పరువును కాపాడినందుకు దీన్ని నేను లంచంగా తీసుకుంటున్నాను.. పాపం మీ అమ్మాయికి డబ్బు లేక ఈ పని చేసుంటారు.. పెళ్ళికయ్యే ఖర్చు ఎంతైనా నూటికి మూడ్రూపాయల ధర్మవడ్డీ చొప్పున అప్పు మీకు నేనిస్తాను. ఎంత కావాలో చెప్పండి. . ఇప్పుడు, ఈ పరిస్థితిలో చెప్పలేకపోతే రాత్రంతా ఆలోచించుకొని రేపు పద్మజ ఇంటికొచ్చి నప్పుడు చెప్పండి. . వస్తాను. బిల్లు నేనిస్తాన్లెండి.. . అని లేచి డోరు తీసుకొని బయటకు నడిచాడు రామారావు.

రామారావు తోసిన తోపుకు అటూ ఇటూ ఊగుతున్న స్ప్రింగు డోర్వైపు అలా జీవం లేని చూపు చూస్తూ ఉండిపోయారు రమణయ్యగారు. ★


డా॥ పి.వి.కె.రావ్, B.A.



సెక్స్ స్పెషలిస్ట్
[వైద్య విశారద - వైద్యాచార్య]
వివాహము వాయిదా వేయనవసరము లేదు. దురభ్యాసములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు...

రావూస్ క్లినిక్.

SUVARNA

ఋణం లభించును

రు. 20,000 లేదా అంతకు పైన ఋణం వ్యాపారాభివృద్ధికి షాపు, బిల్డింగ్, భూమి, థియేటర్, మిల్లులు, ఫ్యాక్టరీ లిమిటెడ్ కంపెనీలు, భారీ పరిశ్రమలపై సరసమైన వడ్డీకి సులభ వాయిదాలపై తిరిగి చెల్లించే పద్ధతిని లభించును, వ్రాయండి లేదా సంప్రదించండి

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే.

BOMBAY FINANCE
40. Tribhuvan Road,
Tejpal Bldg. BOMBAY-4
Tel. No: 354698

వాయిదాలమీద ట్రాన్సిస్టర్లు

ఎగుమతి నాణ్యత గల శక్తివంతమైన



కవ్: బ్యాటరీ సప్లై —లు, 4 బ్యాండ్ల అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్ ను ఇప్పుడు నెలసరి రు. 10/-ల సులభ వాయిదాల మీద పొందండి. వెల రు. 250/—లు, రెండు సంవత్సరముల గ్యారంటీతో ప్రతి పల్లెకు, పట్టణంకు మీ ఇంటికి పంపబడగలదు. ప్రతి సెట్టుతోను లైసెన్సు ఉచితము. నేడే ఆర్డరు పంపండి.

EACHO RADIO &
TRANSISTOR CO. (AP)
Post Box No. 9447, Delhi-110051.

ఉచితం ఉచితం !!

తెల్లమచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే చర్మ రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి రోగ వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట మందు పొందండి.

LALIT AYURVEDIC
PHARMACY (AW)
P.O KATRI SARAI (GAYA)